జయములివ్వు తల్లీ.. జగజ్జనని


మహాలక్ష్మిదేవి అలంకారంలో బాల పోలేరమ్మ


శ్రీ లక్ష్మీనారాయణ అలంకారంలో సత్యదేవుడు


లక్ష్మిదేవిగా దర్శనమిచ్చిన కామకోటి కళాంబదేవి


భావనారుషి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అలంకారం


గజలక్ష్మి అలంకారంలో నాగరాజుపేట శ్రీ రాజరాజేశ్వరీదేవి


శంకరాపురంలో మోహినీదేవి అలంకారంలో విజయదుర్గమ్మ


సంతాన లక్ష్మిగా నడివీధి గంగమ్మ


గరుడ వాహనంపై కడప రాయుడు


స్కంధమాతగా శ్రీ విజయదుర్గమ్మ


కామాక్షీదేవి అలంకారంలో లక్ష్మీదేవి


అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు అమ్మవారి ఆలయాలకు పోటెత్తుతున్నారు. నగరంలోని అన్ని ఆలయాల వద్ద భారీ క్యూలైన్లలో నిలుచుని అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. శుక్రవారం కావడంతో మహిళా భక్తుల రద్దీ పెరిగింది. దేవునికడప శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై నగర వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని స్కంధమాతగా కొలువుదీర్చారు. అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీని మోహినీమాతగా అలంకరించారు. తోటోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్థానిక గడ్డిబజారు శ్రీ సత్యదేవుని ఆలయంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. బాల పోలేరమ్మను శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో మెరిసిపోయారు. నడివీధి గంగమ్మను శ్రీ సంతాన లక్ష్మిగా అలంకరించారు. నాగరాపేటలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించారు. శ్రీ లలితాంబిక ఆలయంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. శంకరాపురంలోని శ్రీ విజయదుర్గమ్మ మోహినీదేవిగా భక్తులను అనుగ్రహించారు. భావనారుషి ఆలయంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిదేవిగా తీర్చిదిద్దారు. ఇంకా నబీకోట రామలింగ చౌడేశ్వరీ, నాగరాజుపేట రాజరాజేశ్వరి, బెల్లారివీధి గంగమ్మ ఆలయం, ఎర్రముక్కపల్లె శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం, రాజారెడ్డివీధిలోని గంగాదేవి, సరస్వతి ఆలయాలలోప్రత్యేక అలంకారాలు నిర్వహించారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర పరిధిలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం ఐదో రోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శన మిచ్చారు. కామాక్షీదేవి అలంకారంలో లక్ష్మీదేవి, గజలక్ష్మీదేవి అలంకారంలో పార్వతీదేవి దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి . లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు పుస్తకావిష్కరణ

కడప ఎడ్యుకేషన్: విశ్రాంత తెలుగు అధ్యాపకులు డి. ఇమామ్ సాహేబ్ రచించిన 'సూక్తి సుధా లహరి' అనే గ్రంథాన్ని వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ప్రొద్దుటూరు సమీపంలోని శంకరాపురం గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని గృహాలు నీటిలో మునిగిపోయాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న సెవెంత్ డే అడ్వంటిస్ట్ సంస్థ భారత వైద్య విద్య సంక్షేమ శాఖతో కలిసి శుక్రవారం బాధితులకు బియ్యం బస్తాలు కంది పప్పు, నూనె అందజేశారు. ఈ కార్యక్రమంలో సెవెంత్ డే అడ్వంటిస్ట్ ప్రతినిధులు శ్యాంసన్, రాంబాబు, కేతి ప్రకాష్, జాన్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలో ర్యాగింగ్ శిక్షార్హం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ, యూనివర్సిటీ అధికారులు

కడప ఎడ్యుకేషన్: ర్యాగింగ్ అనేది ఒక శిక్షార్హమైన నేరమని, యూనివర్సిటీలో జీరో-టాలరెన్స్ పాలసీను కఠినంగా అమలు చేస్తున్నామని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య విశ్వనాథకుమార్ స్పష్టం చేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో విద్యార్థుల కోసం సురక్షితమైన, స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేందుకు శుక్రవారం యాంటీ-ర్యాగింగ్‌కు సంబంధించిన అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోస్టర్ క్యాంపెయిన్ ద్వారా ర్యాగింగ్ దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమేనన్నారు. విజయవాడ స్కూల్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఉన్నతాధికారి మూర్తి మాట్లాడుతూ క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు పాల్పడకుండా విద్యార్థులు కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రజా సంబంధాల అధికారి వి. శివకృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టి.ఎస్. ప్రసాద్ రెడ్డి, అధ్యాపక సిబ్బంది సత్యనారాయణ, కృష్ణస్వామి పరమశివం, తులసి, ఉమ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కేఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజ్, పుష్పగిరి విట్రో రెటీనా హాస్పిటల్ సంయుక్తంగా శుక్రవారం కళాశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. కేఎస్‌ఆర్ఎం కాలేజ్ ఆవరణలో వారి విద్యాసంస్థలో పనిచేస్తున్న వారందరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్రఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మయ్య, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీఎస్ ప్రసాద్, డాక్టర్ వినోద్ కుమార్, డీ. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళల శాఖ ఆధ్వర్యంలో కూచిపూడి, కర్నాటక సంగీతం, కీబోర్డు, సర్టిఫికెట్ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలను ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభించినట్లు డైరక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి. లక్ష్మిప్రసాద్ తెలిపారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబర్ 18వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సంగీతం, శాస్త్రీయ, కూచి పూడి నృత్యం, కీబోర్డ్ పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు ప్రవేశాలు పొందవచ్చని, తరగతులు సాయంత్రం నిర్వహిస్తామని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని సీఆర్పీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారని, అప్పులు చేస్తూ జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఏడాది బడ్జెట్ మొత్తం ఒకేసారి విడుదల చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

సైకో కాబట్టే నీకు మెంటల్ సర్టిఫికెట్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర



మాట్లాడుతున్న యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమైర్

బాలకృష్ణపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

కడప కార్పొరేషన్ : హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అతి పెద్ద సైకో అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అని ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడటం దారుణమన్నారు. అభిమానంతో ఫొటో దిగడానికి వచ్చిన వారికి చెంప పగులగొట్టే బాలకృష్ణ అతి పెద్ద సైకో అని, నిర్మాతను కాల్చి సైకో సర్టిఫికెట్ పొంది కేసు నుంచి బయటపడిన విషయం ఆయన మరిచినట్లున్నారని ఎద్దేవా చేశారు. మేయర్ సురేష్‌బాబును అనర్హుడిగా చేసి బీసీలను అవమానించారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ శాసనసభలో జగన్ నామస్మరణ లేనిదే సమావేశాలు జరగడం లేదని, నిత్యం ఆయన పేరును టీడీపీ, బీజేపీ నాయకులు ఉచ్చరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సర్టిఫైడ్ సైక్రియాట్రిక్ రోగి అని, చిరంజీవిపై ఆయన అక్కసు వెళ్లగక్కడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇప్పటికైనా ప్రజలు జరిగిన వాస్తవాలు ఏమిటో గుర్తించాలని, ఈ సైకో నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

కడప కార్పొరేషన్: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సర్టిఫైడ్ సైకో అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమైర్ అన్నారు. శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో ఎలా మాట్లాడాలన్న ఇంకిత జ్ఞానం కూడా ఆయనకు లేదని మండిపడ్డారు. బాలకృష్ణ తక్షణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పి. రామ్మోహన్ రెడ్డి, సింధే రవి పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని నియంత్రించండి


రవాణాశాఖ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీని నియంత్రించాలని శుక్రవారం జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏఓ ప్రకాశ్‌కు డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు పండుగ సెలవులను ఆసరాగా చేసుకుని బస్సు టికెట్ ధరలను ఇష్టానుసారంగా పెంచి నిలువు దోపిడి చేస్తున్నారని పేర్కొన్నారు. కడప నుంచి హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, విజయవాడ ప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ నడపుతున్నారన్నారు. ట్రావెల్స్ యజమానులు పండుగ రోజుల్లో రెండింతలు వసూలు చేస్తున్నారన్నారు. సింగిల్ డ్రైవర్‌లను సర్వీసు రూట్లను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు బస్సుల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం స్వల్ప మాత్రమేనని, వాటి యాజమాన్యానికి మాత్రం కాసులవర్షం కురిపిస్తోందన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడే అవకాశం ఉందన్నారు. వెంటనే ప్రైవేటు బస్సుల నిలువుదోపిడీని అరికట్టి టికెట్ల ధరలు పెంచి అక్రమంగా ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, సునీల్ పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు


మొక్కలు నాటుతున్న చిన్నపరెడ్డి, ఫారెస్టు అధికారులు

కడప ఎడ్యుకేషన్: టూరిజం అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇంటాక్ జాతీయ గవర్నింగ్ సభ్యులు లయన్ చిన్నపరెడ్డి తెలిపారు. ఇంటాక్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం ముందస్తు వేడుకలను కడప నగరవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడపలో అనేక కళాత్మక సాంస్కృతిక చారిత్రక దర్శనీయ ప్రదేశాలన్నింటినీ కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసి, అభివృద్ధి చేయాలని కోరారు. నగరవనం ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్, డిప్యూటీ రేంజర్ మల్లికదేవి, టూరిజం కమిటీ సభ్యుడు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, సభ్యులు మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి, సెక్రటరీ గునిశెట్టి సాయి, జోన్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, సెకాలజిస్ట్ ఓవీరెడ్డి, రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు, వైవీయూ రామసుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం సొసైటీ కార్యదర్శి జనార్దనరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అక్రమాలపై ఆందోళన

కడప ఎడ్యుకేషన్: ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయల పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని, ఉద్యోగం పొందిన ఉపాధ్యాయుల చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్యన్ రాజా డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థి యువజన ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యాసంవత్సరం ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయల నియమాకాలు జరిగాయిని, అయితే విద్యార్థులు లేని పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. విద్యార్థి యువజన ప్రజా సంఘాల జేఏసీ కమిటీ సభ్యులు కొడవటికంటి నాగరాజు, బండెల ఓబులేసు, కత్తి ఓబులేసు, ఇండ్ల జయరాజు, మల్లెల జగదీష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు


అభ్యర్థి డెమోను వింటున్న వీసీ, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ అండ్ టౌన్ ప్లానింగ్ విభాగాల్లో తాత్కాలిక ప్రతిపాదికన అతిథి అధ్యాపకుల నియామకాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా సాగాయి. ఈ ఇంటర్వ్యూల కార్యక్రమం వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ కుమార్ అధ్యక్షతన ప్రశాంతంగా సాగాయి. ఇంటర్వ్యూల కోసం వచ్చిన అభ్యర్థుల అర్హతలు, బోధన నైపుణ్యాన్ని డెమో ద్వారా పరిశీలించారు. దీంతోపాటు బోధనలో వారి అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరిగింది. అతిథి అధ్యాపకుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని వీసీ విశ్వనాథకుమార్ తెలిపారు.

మానసిక రుగ్మతలను నివారించాలి


మాట్లాడుతున్న న్యాయవాది శాంత

కడప అర్బన్: మానసిక రుగ్మతలను నివారించాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శాంత పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప సూచనలతో కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో మానసిక ఆరోగ్య సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్య పోస్టింగ్ పెట్టిన కేసులో ఒకరి అరెస్ట్

కడప అర్బన్ : కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడి.. వాటిని వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కడప వన్ టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. టీడీపీ నుంచి బహిష్కరణకు గురైన విజయ అలియాస్ విజయరెడ్డి కడప ఎమ్మెల్యేపై అసభ్య పదజాలంతో మాట్లాడి, వాటిని వీడియో తీసి పోస్టింగ్‌లు పెట్టినట్లు తెలిపారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు పేర్కొన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇస్మాయిల్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు.

రౌడీషీట్ ఓపెన్ చేస్తాం : డీఎస్పీ

ఎవరైనా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఇతరులను గానీ సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో కానీ అసభ్యకరమైన న్యూడ్ వీడియోస్ పోస్టింగులు చేస్తే వారిపై రౌడీషీట్ తెరుస్తామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఎవరు కూడా సోషల్ మీడియాలో వచ్చే అసభ్య వీడియోలను ఇతరులకు షేర్ చేయొద్దని ఆయన సూచించారు.

చాకలి ఐలమ్మ జీవితం అందరికీ మార్గదర్శకం


కడప సెవెన్‌రోడ్స్: ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కడప రూరల్: చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నేతలు


వీర వనిత ఐలమ్మ

కడప సెవెన్‌రోడ్స్ : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం అందరికీ మార్గదర్శకమని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఐలమ్మ 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, తి జిల్లా కేంద్రంలో ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. రజక ఐక్యవేదిక నాయకుడు నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు సంగటి మనోహర్, అమీన్‌పీరా, జేవీ రమణ, సీఆర్‌పీ ప్రసాద్, కె.ఆంజనేయులు, వైఎం ప్రతాప్‌రెడ్డి, దేవర శ్రీకృష్ణ, కై పు రామాంజనేయులు, పీవీ రమణ, నూకల పెంచలయ్య పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఐలమ్మ వీర వనిత అని రాష్ట్ర రజక సంఘం నేత, ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ లోగిడి జయన్న అన్నారు. ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లో ఏలూరు లాకుల సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆయన హాజరయ్యారు.


కడప రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చేలో రవి కోరారు. శుక్రవారం రజక సంఘం కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం ఐలమ్మ పోరాడారని కొనియాడారు. ధైర్యానికి మారుపేరుగా నిలిచిన ఆమెను మహిళలు ఆదర్శవంతంగా తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు మల్లయ్య, శ్రీకృష్ణ, ఎరుకలయ్య, వెంకట్రావు, కష్ణ, చెన్నప్ప పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షుడు శివశంకర్ కోరారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. కొత్త ఆపరేటర్లలకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్కిల్ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌ను నియమించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసంఅక్టోబర్ 5వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, అక్టోబర్ 10న ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పీసీ కొండయ్య, మల్లికార్జున్‌రెడ్డి, చంద్రమౌళి, శివప్రసాద్‌రెడ్డి, గోపి ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ముద్దల కిరణ్‌కుమార్, స్పందన వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మేయర్ కె. సురేష్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్, మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, పి. సంపత్ కుమార్, కో ఆప్షన్ సభ్యురాలు బి. మరియలు పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం రాత్రి కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు విజయ్‌భట్టర్ తీర్థ ప్రసాదాలు అందజేసి రవీంద్రనాథ్‌రెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థికి ట్రోఫీ అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులను స్వాగతం పలుకుతూ వారి భవిష్యత్తుకు చక్కటి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ మొదటి సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు సలహాలివ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.